ప్రజాశక్తి

ఆదివారం 14 జనవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అద్దంకిలో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య

'భోగి' మంటల్లో..

'ఎస్మా' ప్రతులు దహనం

33వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్క రించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులు దహనం చేసి.. నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ గత 33 రోజులుగా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే పరిష్కరించక పోగా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగిం చడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం అనేక విధాలుగా బెదిరిం పులకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం దిగిరాకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. అంగన్‌వాడీలకు అండగా సిఐటియు ఉంటుందన్నారు. అంగన్ వాడీలకు రైతు, కౌలురైతు సంఘాలు, ▶ 2లో

ఎన్‌జిపాడులో ఎస్మా ప్రతులు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

పందెం కోడి.. రెడీ

- పోలీసుల హెచ్చరికలున్నా బేఖాతరు..
- నిజాంపట్నంలో బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

నిజాంపట్నంలో సిద్ధం చేస్తున్న బరులు

ప్రజాశక్తి-రేపల్లె, నిజాంపట్నం

సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. పోలీసులు ఓ వైపు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. తగ్గేదే లేదంటున్నారు. కోళ్లను బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నారు. బరులను సిద్ధం చేస్తున్నారు.

రేపల్లె నియోజకవర్గం, నిజాంపట్నంలో కోడిపందేలు నిర్వహించేందుకు, మూడు రోజులు కోలాహలం చేసేందుకు పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. గుంటూరు, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు తెలంగాణా నుంచి భారీగా జూదరులు వస్తారని అంచనాలు వేసుకొని ఆ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఏటా సంక్రాంతి సమయంలో ముఖ్యంగా తీరప్రాంతంలో జరిగే కోడి పందాలను అడ్డుకుని తీరుతామంటూ పోలీసులు హెచ్చరించటం.. తర్వాత అక్కడ కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించడం సర్వసాధారణమైంది. ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో ముడిపడిన కోడి పందేల విషయంలో నియంత్రణ సాధ్యమేనా అనేది చర్చనీయాంశం.

వందలాది పెంపకం కేంద్రాలు..

ఒక్క రేపల్లె నియోజకవర్గంలో పందెం కోళ్ల పెంపకం కేంద్రాలు దాదాపు 100కు పైనే ఉన్నాయి. ఒక్కొక్క ఫామ్‌లో 100 నుండి 150 కోళ్లకు ట్రైనింగ్ ఇస్తున్నారు. సంక్రాంతి సమీపిస్తుండటంతో నియోజకవర్గంలో ఇప్పటికే ఐదు వేల కోళ్లకు పైనే పందేలకు రెడీ అవుతున్నట్లు సమాచారం. కొన్ని కేంద్రాల్లో స్పెషల్‌గా మేలు జాతి పందెం పుంజుల, పెట్టల నుండి గుడ్లను పొదిగించి ఆ పిల్లలను జాగ్రత్తగా పెంచుతున్నారు. ఆరు నెలల నుండి సంవత్సరం వయస్సు వచ్చే వరకు గుంపులుగా బయట పెంచి.. తర్వాత నుండి ఒక్కొక్క పందెం కోడిని విడివిడిగా పెంచుతారు. ఈ పందెం కోళ్లను పెంచడానికి విశాలమైన స్థలాలను లీజుకు తీసుకుంటారు. వాటి కోసం ప్రత్యేకంగా గాబులు, గ్రిల్స్ తో కూడిన బాక్సులు తయారు చేయిస్తారు.

కోడి పుంజు జాతిని బట్టి పందెం..

ముఖ్యంగా పందాలను ట్రైనింగ్ ఇచ్చే కోళ్ల జాతులు కూడా దాదాపుగా 90 వరకు ఉన్నాయి. వీటిలో డేగ, కాకి, కాకిడేగ, నెమలి, కాకి నెమలి, నెమలి డేగ, ఎర్ర కొక్కిరాయి, నెమలి పింగళ, సీతువా, రసింగి, పచ్చ కాకి, అబ్రాస్,తెల్ల కొక్కిరాయి, పెట్టమారి, కోడి డేగ, నల్ల కొక్కిరాయి, డేగ పూల లాంటి పందెం కోళ్లు చాలా ముఖ్యమైనవి. ఈ జాతులను బట్టే పందెం రాయుళ్లు బెట్టింగులు కాస్తారు. అయితే ప్రస్తుత జనరేషన్‌లో పెర్విన్ తూర్పు, పర్ల, మైల జాతులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

మిర్చి రైతుకు కష్టాలే..

- అప్పుడు తుపాను దెబ్బ..
- ఇప్పుడు ధరాఘాతం
- దిక్కుతోచని స్థితిలో కర్షకులు

మిర్చిలో తాలుకాయలు ఏరుతున్న కూలీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎన్నో ఆశలతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టి మిరప పంట సాగు చేసిన రైతులకు కన్నీరే మిగులుతోంది. గతేడాది నవంబరులో మిగ్‌జాం తుపాను ప్రభావంతో పంటకు నష్టం వాటిల్లింది. మిగిలిన పంటను దక్కించుకునేందుకు రైతన్న వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. తీరా పంట చేతి కొచ్చే సమయంలో ధర పతనం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. జిల్లాలో ఎక్కువగా పడించే తేజ, 2222, 341, యశశ్విని వంటి రకాల మిరప క్వింటా ధర ప్రస్తుతం రూ.15 వేలకు మించి లేదు.

జిల్లాలో ఈ ఏడాది 75 వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. కొందరు పంట వేసినా బోర్లలో నీరు అందకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. మరో వైపు ఈసారి పెట్టుబడులు అధికమయ్యాయి. మిరప సాగు ప్రారంభంలో వర్షాభావం నెలకొంది. బెట్ట పరిస్థితుల నుంచి పంటను కాపాడుకుంటూ వచ్చారు. తెగుళ్ల నివారణకు భారీగా పురుగు మందులు పిచికారీ చేశారు. అయితే కాపు కొచ్చే ▶ 2లో

తాలుకాయలు వచ్చాయి

బాశం రమణారెడ్డి, మిర్చి రైతు, మురారిపల్లి

ఐదు ఎకరాల్లో మిరప సాగు చేశాను. రూ.ఆరు లక్షల దాకా పెట్టుబడి అయ్యింది. మిగ్‌జాం తుపాను ప్రభావంతో తాలుకాయలు ఎక్కువగా వస్తున్నాయి. కాయలు ఏరకుండా అమ్మాల్సిన పరిస్థితి ఉంది. మార్కెట్‌లో అవి రూ.5 వేలు మించి కొనుగోలు చేయడం లేదు. కనీసం కోత కూలి కూడా రావ డం లేదు. క్వింటా రూ.20 వేలుపైగా అమ్మితేనే గిట్టుబాటు అవుతుంది.

ధరలు పతనం

ఆర్ తిరుపతి నాయక్, మిర్చి రైతు, మూలమడుగు తాండా

రెండున్నర ఎకరాల్లో మిరప తోటను సాగు చేశాను. పెట్టుబడుల రూపంలో రూ.2.80 లక్షలు ఖర్చు చేశా. మిరప నారు నాటే సమయంలో సాధారణ రకాలు రూ.20 వేల నుంచి రూ.23 వేల వరకు మిర్చి ధర పలికింది. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే ధరలు ఉన్నాయి. పురుగు మందులు, ఎరువుల ధరలు పెరిగాయి. నీటి తడులకు ఎకరాకు రూ.వేలు ఖర్చు చేశాం. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదు.

భార్యను హత్య చేసి..

- ఆపై భర్త ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం
- నాయుడుపాలెంలో ఘటన

వెంకటేశ్వరరెడ్డి (ఫైల్), జ్యోతి (ఫైల్)

ప్రజాశక్తి-పుల్లలచెరువు

భార్యను చంపి ఆ తర్వాత భర్త కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నాయుడుపాలెం గ్రామానికి చెందిన నారు వెంకటేశ్వరరెడ్డి(29) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన జ్యోతి (26)తో వెంకటేశ్వరరెడ్డికి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. మొదట్లో బాగానే ఉన్నారు. జ్యోతి బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా సెలక్టు అయింది. ట్రైనింగ్ నిమిత్తం కొంత కాలం భార్యాభర్తలిద్దరూ ఒరిస్సాలోనే కాపురం ఉన్నారు. ఆ తర్వాత ఆమెకు బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఒరిస్సాలో ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య కలహాలు చోటుచేసుకున్నాయి. దీంతో వెంకటేశ్వరరెడ్డి స్వగ్రామమైన నాయుడుపాలెంలో ఉంటూ జేసీబీ ఆపరేటర్‌గా జీవనం గడుపుతున్నాడు. జ్యోతి ఒరిస్సాలోనే ఉద్యోగం చేసుకుంటోంది. కాగా నెల రోజుల క్రితం జ్యోతి తన స్వగ్రామమైన జేసీ అగ్రహారం వచ్చి తల్లిదండ్రుల ఇంట్లో ఉంది. శుక్రవారం నాయుడుపాలెం నుంచి కొంత మంది పెద్ద మనుస్సులు జేసీ అగ్రహారం వెళ్లి జ్యోతి తల్లిదండ్రులతో మాట్లాడి భార్యాభర్తలిద్దరినీ సఖ్యత పరిచారు. జ్యోతిని నాయుడుపాలెం తీసుకువచ్చారు. శనివారం ఉదయం కుటుంబసభ్యులంతా పొలాలకు వెళ్లిన సమయంలో భార్యాభర్తల మధ్య తిరిగి ఘర్షణ చెలరేగింది. కోపోద్రిక్తుడైన వెంకటేశ్వరరెడ్డి ట్రాక్టరు నాగలి కర్రు తీసుకొని ఆమె తలపై బాదాడు. దీంతో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ తర్వాత భయాందోళనకు గురైన వెంకటరెడ్డి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి పిల్లలు లేరు. యర్రగొండపాలెం సిఐ కె మారుతీకృష్ణ, ఎస్సై శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఎస్మా' ప్రతులు దహనం

(మొదటిపేజీ తరువాయి)

సిఐటియు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించా యి. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతి బాబు, కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్, సిఐటియు నాయకులు జి.బసవ పున్నయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు దుర్గా భవాని, వెంకట సుబ్బమ్మ, అరుణ, రజని, రమ పాల్గొన్నారు.

అన్ని ప్రజాసంఘాలతో పోరాటం

అద్దంకి: అంగన్వాడీలు ఒక్కరే ఇక నుండి ఈ పోరాటం చేయరని, అంగన్వాడీలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రజా సం ఘాలు కలుపుకొని పోరాటాన్ని కొనసాగిస్తా మని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.గంగయ్య తెలిపారు. అంగన్వాడీల సమ్మె శనివారం 33వ రోజుకి చేరుకుంది. అంగన్వాడీల సమ్మెకు గంగయ్య సంఘీభావం తెలిపి.. మాట్లాడారు. ప్రభుత్వం అంగన్వాడీల పట్ల మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం సంక్రాంతి పండగను అంగన్వాడీలకు లేకుండా చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు జి.శారద, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ నాయకులు మనోలత, చంద్రమతి, లీల, రామమ్మ పాల్గొన్నారు.

మిర్చి రైతుకు కష్టాలే..

(మొదటిపేజీ తరువాయి)

దశలో మిగ్‌జాం తుపాను వెన్ను విరిచింది. పొలంలో నీరు నిలిచి ఉరకెత్తి మొక్కలు గొడుగులెత్తాయి. చెట్టు ఎర్రబారి పూత, పిందె పూర్తిగా రాలిపోయింది. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు మించి దిగుబడి రావడం లేదు. తాలు కాయలు వచ్చాయి. అవి క్వింటా రూ.5 వేలకు మించి ధర పలకడం లేదు.

ఏ మాత్రం గిట్టుబాటు లేదు

కైపు వెంకట కోటిరెడ్డి, మిర్చి రైతు, మురారిపల్లి

ఈ ఏడాది దిగుబడులు తగ్గి పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం రైతు నుంచి మార్కెట్‌కు తక్కువ స్థాయిలోనే సరకు వస్తోంది. ఈ సమయంలోనే వ్యాపారులు ధరలు తగ్గించారు. పూర్తి స్థాయిలో రైతుల నుంచి మార్కెట్‌కు సరకు వస్తే మరింతగా ధరలు తగ్గుతాయి. ఈ ధరలతో ఎటు చూసినా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది.

పాత ప్రదేశాల్లో పనులు నిర్వహిస్తే చర్యలు

- డ్వామా పిడి శీనారెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు

జాతీయ ఉపాధి హామీ పనులు నిర్వహించేటప్పుడు కొత్త ప్రదేశాలలో గుర్తించి పనులు నిర్వహించాలని, అలాకాకుండా పాత వాటిలో పనులు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని డ్వామా పిడి శీనారెడ్డి అన్నారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి శీనారెడ్డి మాట్లాడుతూ రాబోయే సామాజిక తనిఖీ నుంచి కొత్త మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రతి టిఏ, ఎఫ్ఏలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. 2022-23 ఉపాధి పనులు మండలంలో 9కోట్ల 80 లక్షల వరకు పనులు జరిగాయని అన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాలకి టిఏలు వెళ్లకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన సామాజిక తనిఖీలో ఆర్ఆర్ యాక్టు కింద రూ.2 లక్షలు రాశారని, వాటిలో ఇంకా 12వేలు బకాయి ఉందని తెలిపారు.

కరాటే స్కూల్ ర్యాలీ

ప్రజాశక్తి-మార్కాపురం

ఇటీవల 2023-24 ఏడాదిలో భాగంగా రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో జరిగిన 24వ స్పై మార్షల్ ఆర్ట్స్ నేషనల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున మార్కాపురం విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిది గోల్డ్ మెడల్స్ సాధించారు. గతంలో సౌత్ జోన్‌లో కరాటే ఛాంపియన్‌షిప్, గోల్డ్ మెడల్స్, ఢిల్లీలో కియో కరాటే నేషనల్ పోటీల్లోనూ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ మేరకు మార్కాపురం పట్టణంలో కరాటే స్కూల్ విద్యార్థులు శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే మాస్టర్లు మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

మండలంలోని దివాకరపురంలో కనిగిరి నియోజకవర్గ స్థాయి క పోటీలను ఎస్ఐ జి కోటయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ ఆటలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కబడీ ఆడే సమయంలో స్నేహపూరిత వాతావరణంలో ఉండాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. మొదటి ప్రథమ బహుమతి రూ.15116లను కోయ వెంకటేశ్వర్లు అందజేస్తారని తెలిపారు. ఒంగోలులోని ప్రముఖ వైద్యశాల, చైతన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ చైతన్య ద్వితీయ బహుమతి రూ.10,116లను అందజేయనున్నట్లు తెలిపారు. తృతీయ బహుమతి కోటపాటి కోటయ్య రూ.5116లు అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం నియోజకవర్గ స్థాయిలో 16 టీములు పాల్గొన్నట్లు నిర్వాహకులు చీమలదిన్నె గోవిందయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె.శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శీలం సుదర్శనం, నిర్వాహకులు వజ్రాల మాచర్ల, నీలం చింటూ, సీలం రాము తదితరులు పోటీలను నిర్వహించారు.

గుడి పేరుతో.. ప్రభుత్వ భూమి దోపిడీ..

ప్రజాశక్తి-మార్కాపురం

ఆక్రమిత ప్రభుత్వ స్థలం

'గుడి' పేరుతో ప్రభుత్వ భూమి 'దోపిడీ'కి గురవుతోంది. మార్కాపురం పట్టణ సమీపంలోని వేముల కోట ఇలాఖాలో గల సర్వే నెంబరు 164లో 0.33 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ప్రధాన రహదారికి అనుకుని ఉండటం... వ్యాపార నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉన్నందున దాని విలువ రూ. 2 కోట్లకు చేరింది. ఇదే భూమి వెనుక వైపున ఓ రియల్టర్‌కు చెందిన భూమి ఉంది. అందులో ప్లాట్లు వేశాడు. ప్రభుత్వ భూమిని కలుపుకుంటే అక్కడ ప్లాట్ల విలువ మరింత పెరుగుతుందనే స్వార్థంతో గుడి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాడు. ఈ విషయం రెవెన్యూ పెద్దలకు తెలిసి కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు చొరవ చూపిస్తే తప్ప విలువైన భూమి దక్కేలా లేదు.

ఎమ్మెల్యే అభ్యర్థిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి అర్ధవీడు

వైసిపి గిద్దలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిని తక్షణమే ప్రకటించాలని ప్రకాశం జిల్లా అర్ధవీడు మండల మాజీ ఎంపీపీ గొట్టికె రాజేశ్వర్‌రెడ్డి అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికలలో 80 వేల ఓట్ల మెజారిటీకి పైగా గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే వచ్చే ఎన్నికలలో పోటీ చేయనని ప్రకటించడంతో ఇక్కడ కొత్త ఎమ్మెల్యే అభ్యర్థిని ఎంచుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆయన అన్నారు. స్థానికులకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే బాగుండేదని అన్నారు. అసలు ఇక్కడ ఎవరిని ప్రకటిస్తారో అర్థం కాక కార్యకర్తలు అయోమయంగా ఉన్నారని, అధిష్టానం సాధ్యమైనంత త్వరలో గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎస్ఐ హరిబాబు అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో మాజీ సర్పంచ్ మాదాసు కృష్ణమూర్తి జయంతి, సంక్రాంతి సందర్భంగా మాదాసు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఎస్ఐ హరిబాబుతో పాటు ఎంపిడిఓ జయమణి, తహశీల్దారు సుజన్ కుమార్ ప్రారంభించారు. గెలుపు ఓటములు సహజమని, స్ఫూర్తిగా తీసుకొని ఆడుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలుత మాదాసు కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాదాసు రాంబాబు, పెంట్యాల శ్రీనివాసరావు, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఉపసర్పంచ్ పి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాదు, ఏలీష, కొంజేటి సురేష్‌బాబు, ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు, మాదాసు నాగేశ్వరావు, ఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిడిఓ, ఎస్ఐ, తహశీల్దారు, సర్పంచ్ జయమ్మ

విజయం కోసం కృషి చేయాలి

యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-మార్కాపురం

చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అభిమానులు

త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి విజయాన్ని సాధించాలని వైసిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గం వైసిపి అడ్డా అని మరోసారి నిరూపించాలన్నారు. మార్కాపురంలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాలులో యర్రగొండపాలెం నియోజకవర్గ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు, హాజరైన కార్యకర్తలతో పరిచయం చేసుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం పేద ప్రజలకు అవసరమన్నారు. గత ప్రభుత్వ కాలంలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వర్గాలు, గ్రూపులు లేకుండా పని చేద్దామన్నారు. తనకు అందరూ సమానమే అన్నారు. మీ సూచనలు, సలహాలతో ముందడుగు వేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను వైసిపి శ్రేణులు సత్కరించేందుకు పోటీ పడ్డారు.

త్రిపురాంతకంలో 'తాటిపర్తి' ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ నూతన సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం రాత్రి త్రిపురాంతకేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిపురాంతకం సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, మాజీ ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని పెరిదేపి గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్ ఎన్ బాలకృష్ణ, నల్లపు విజయరామరాజు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వాలీబాల్ పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి మొదటి, రెండో బహుమతులు ఇస్తామని తెలిపారు. వాలీబాల్ పోటీలు ప్రారంభించడానికి వైసిపి రాష్ట్ర నాయకులు ఢాకా పిచ్చిరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, జడ్‌పిటిసి మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, చింతల గ్రానైట్స్ అధినేత చింతల వెంకటేశ్వర్లు, వేముల రమేష్ వస్తున్నారని తెలిపారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్ ఇన్‌ఛార్జి టీడీపీ, జనసేనల ఉమ్మడి మ్యానిఫెస్టో లోని సూపర్‌సిక్స్ పథకాలను నియోజక వర్గంలోని ప్రతీ కుటుంబానికి వివరించాలని, టీడీపీ జనసేనల ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను తెలియచేయాలని ప్రతీ ఒక్క తెలుగుదేశం కార్యకర్త గ్రామస్థాయిలో కష్టపడి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలన్నారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతగుంపల్లిలో వికసిత భారత్

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని చింతగుంపల్లి, లక్ష్మక్కపల్లి, పంచాయితీలలో శనివారం వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 పథకాల గురించి ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి వివరించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఓఆర్డి డి.నాగమల్లేశ్వరి, పంచాయితీ కార్యదర్శి ఆచారి, స్థానిక ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ యు మంజుల, ఎంపిటిసి భూమిరెడ్డి కొండారెడ్డి, మాజీ సర్పంచి మేకల మాల్యాద్రి, దగ్గుమాటి బలరామిరెడ్డి, ఎపిఎం జి.సత్యానందం, లక్ష్మక్కపల్లి సర్పంచి మచ్చా మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.No. 762/2020

Between :
Bommareddy Rajasekhar Reddy ....Plaintiff
AND
M/s Sri Vijetha Constructions (Regd. Firm) Guntur Rep. by its Mg. Partner, Balabadrapatruni Varun Vamsi and 11 others .... Defendants

DEFENDANTS No.8

D8 : Srirama Kameswaramma, W/o Kameswara Rao, Hindu, aged about 72 years, Properties, R/o. Geetha Nilayam, Anjaiah Road, Ongole Town, Prakasam District.

The above said suit stands posted for appearance of the 8th defendant on 06-02-2024 to answer the claim of the plaintiff either in person or through their Advocate at 10-30 A.M. onwards.

Vijayawada
Dt : 12-01-2024

B.Koti Reddy, B.Sc., B.L.,
B.S. Ratnakar Reddy, B.com., B.L.
Advocates
Ammana Estates, Governorpet,
Vijayawada - 520002.
Ph : 9490148500

పెద్దారవీడు వైసిపి నేతల అలక

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి నేతల్లో గ్రూపులు బహిర్గతమయ్యాయి. యర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ మార్కాపురంలోని సెవెన్ హిల్స్‌లో శనివారం నిర్వహించిన తొలి సమావేశానికి పెద్దారవీడు మండలంలోని వైసిపి ముఖ్య నేతలు డుమ్మా కొట్టారు. పెద్దారవీడు మండలంలో వైసిపి బలంగా ఉంది. గత ఎన్నికల్లోనూ ఏడువేల ఓట్ల మెజార్టీ లభించింది. మండల కన్వీనర్‌గా పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి కొనసాగుతున్నారు. ఎంపిపిగా బెజవాడ పెద్ద గురవయ్య, జడ్‌పిటిసిగా యేర్వ చలమారెడ్డి పనిచేస్తున్నారు. గతంలో ఎంపిపిగా, జడ్‌పిటిసిగా పనిచేసిన దుగ్గెంపూడి వెంకటరెడ్డి ఎక్కడో ఉంటున్నారు. చాలా కాలంగా మండల ప్రజలతోనూ సంబంధం లేదు. ఈ సమావేశానికి హడావుడిగా వచ్చి అంతా తానేనే విధంగా వ్యవహరించినట్లు తెలిసింది. స్థానికంగా

ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌తో ముఖాముఖికి డుమ్మా!

పనిచేస్తున్న నేతలంతా వెంకటరెడ్డిపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. తొలి సమావేశానికి సరైన పిలుపు కూడా లేదని తెలిసింది. దీంతో పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్ద గురవయ్య, జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డిలతో పాటు వారివారి అనుచర గణం సమావేశానికి డుమ్మా కొట్టింది. దీంతో పాటు పెద్దారవీడు మండలంలో తొలిసారిగా చంద్రశేఖర్ పర్యటన జరిగింది. ఈ సందర్భంగా వెలిసిన ఫ్లెక్సీల్లో పైన పేర్కొన్న ముగ్గురు ముఖ్య నేతల ఫోటోలు లేవు. దీంతో మరింత ఆగ్రహం చెందిన ఆ ముగ్గురు తమ అనుచర గణాన్ని కూడా సమావేశానికి హాజరు కానివ్వలేదు. ఎన్నికల నాటికి వర్గపోరు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తోందోనని వైసిపిలో చర్చ నడుస్తోంది.

ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బూచేపల్లి

ఎస్పీని కలిసిన బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

ఒంగోలులో జిల్లా ఎస్పీ మలికాగర్గ్‌ను దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు వచ్చిన తరువాత ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మాట్లాడుతున్న అబ్దుల్‌గఫార్

వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-కనిగిరి

వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యశాలలో జరుగుతున్న వైద్యశాల మరమ్మతులను పరిశీలించి ప్రత్యక్షంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వైద్యులు రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. డయాలసిస్ సెంటర్ కనిగిరి పట్టణ పరిసర ప్రాంత కిడ్నీ బాధితులకు వరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్‌తో పాటు వైద్యశాల సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు, వైసిపి నాయకులు ఎస్ఎస్ రసూల్, అరుణోదర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాటం ఆడుతున్న మహిళలు

చెన్నకేశవనగర్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులోని చెన్నకేశవనగర్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

వెలుగొండారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని హనుమంతపురం పంచాయతీలోని కొత్తపల్లిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, బాబాయి సానికొమ్ము చిన్న వెలుగొండారెడ్డి(70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సానికొమ్ము తిరుపతిరెడ్డి, రజనీ దంపతులు, మండల తెలుగుదేశం నాయకులు గాయం రామిరెడ్డి, కందుల సుబ్బారెడ్డి, దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, గ్రామ కార్యకర్తలు.. చిన్న వెలుగొండారెడ్డి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

300 మందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారం వెంకారెడ్డి 300 మందికి దుస్తులు పంపిణీ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మారం వెంకారెడ్డి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్వారీ మేనేజర్లు మేడగం బ్రహ్మారెడ్డి, మేడగం వెంకటేశ్వర్లరెడ్డి, విశ్వనాథ్, రమేష్, ప్రజ్వల్, జగదీష్, ప్రసాద్, కోట రాములు, అంజిరెడ్డి, వెంకటేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు భరోసా కల్పించడమే 'సంక్రాంతి'

ప్రజాశక్తి-ఒంగోలు

సాయం చేయడం ద్వారా పేదలకు ఆనందాన్ని పంచడమే నిజమైన సంక్రాంతి అని, సాటివారి కష్టసుఖాల్లో మేమున్నామనే భరోసాను కల్పించడమే సంక్రాంతి అని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ అన్నారు. సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఐ ఎంఎస్ అమర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో వందమంది పేదలకు లక్ష రూపాయల విలువ గల బియ్యం, నిత్యావసర వస్తువులను ట్రస్టు నిర్వాహకులు షేక్ సర్దార్ బాషా, షహనాజ్ దంపతుల ఆధ్వర్యంలో ఒంగోలు, కర్నూల్‌రోడ్‌లోని సూర్యశ్రీ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో శనివారం పంపిణీ చేశారు. ట్రస్టు సెక్రెటరీ సర్దార్ బాషా, స్మార్ట్‌ఐ ఎంఎస్ నిర్వాహకులు పి చెన్నకేశవరెడ్డి, డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ సూర్యశ్రీ ట్రస్ట్ పేదలకు పిండివంటలు చేసుకోవటానికి నిత్యావసరాలు అందించి మానవత్వం చాటుకుందని అన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, కోమరి శ్రీదేవి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేసిన సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్టు

సరుకులు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ, డాక్టర్ వంశీకృష్ణ

ఉచితంగా నేత్ర వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఐ క్యాంప్ రివ్యూ జరిగింది. జననీ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలను శంకర కంటి ఆసుపత్రి వైద్యులు సోనాలి బెహ్రా, సుభాష్, సుధీర్, చిన్మయిలు వృద్ధులకు నిర్వహించారు. గత డిసెంబరు 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారిలో 108 మంది ఈ రివ్యూలో పాల్గొన్నారు. కంటి వైద్య పరీక్షలు అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయం వైద్యులు, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బీసీలకు వెన్నుదన్నుగా చంద్రన్న: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

బీసీలకు వెన్నుదన్నుగా ఎన్టీఆర్, చంద్రన్న నిలిచారని కనిగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్లో శనివారం బీసీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఒక్క అవకాశమని అడిగి పదవిలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీ సోదరులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సరైన ఆర్థిక ప్రణాళిక లేకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని అతలాకుతలం చేసి బీసీలకు ఉపాధి అవకాశాలు, అభివృద్ధి లేకుండా చేసిందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలుపరచకుండా 55 నెలల నియంత పాలనలో బీసీలపై దాడులు చేయించి వారిని ఆర్థికంగానే కాకుండా మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం చేశారని అన్నారు. భవిష్యత్తుపై వారి కలలను చిదిమివేశారని, బీసీల ప్రగతి తెలుగుదేశంతోనే సాధ్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పడవలు, ఇతర పరికరాలను 90శాతం వరకు సబ్సిడీతో అందించారు. చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలు వదిలి వాటి వేట హక్కులు మత్స్యకార సహకార సంఘాలకు అప్పగించారన్నారు. చేనేత కార్మికుల పెన్షన్ రూ.200 నుంచి రూ.2000 పెంచారన్నారు. నేత కార్మికుల కోసం 100 యూనిట్ల ఉచిత విద్యుత్, వలలు, పడవలు, ఇతర పరికరాలను 90 శాతం వరకు సబ్సిడీపై అందజేశారన్నారు. బోయ వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా రూ.120 కోట్ల రుణాలు అందించారని ఎస్టీల్లో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చేలా బీసీలు ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు

ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలంలోని ముష్టగంగవరం దగ్గర బలరాం క్యాంప్ ఆఫీస్ పక్కన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎనిమిది ఎకరాలలో ఉన్న ఫ్యాక్టరీలో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రావడం లేదని మరో రెండు ఫైర్ ఇంజన్లు అవసరం అని ఉన్నతాధికారులకు తెలిపారు. వినుకొండ అగ్నిమాపక సిబ్బంది, యర్రగొండ పాలెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల నుంచి మద్యం తరలిస్తున్న ఇరువుని సెబ్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు ఫుల్‌బాటిల్స్, రెండు హాఫ్ బాటిల్స్, ఒక క్వార్టర్ బాటిల్, కర్నాటక నుంచి వచ్చిన వ్యక్తి ద్వారా కలిసి మొత్తం 11 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సెబ్ సిఐ ఎన్.రాగమై, ఎస్ఐ పద్మజ, హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'రాజకీయాల్లో వాటా పొందాలి'

ప్రజాశక్తి-ఒంగోలు

అధికార రాజకీయాలలో బహుజనులు తమ వాటా పొందడానికి తగిన ప్రయత్నాలు చేయాలని రాజకీయ విశ్లేషకులు సతీష్‌చంద్ర సూచించారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'తెలుగు రాష్ట్రాల్లో మూడు ముక్కలాట, రాజకీయ క్రీడ ఆ కులాలదేనా?' అనే అంశంపై పొలిటికల్ వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. స్థానిక మల్లయ్య లింగయ్య భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సతీష్‌చంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో బహుజన మేధావులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుమంజన సేవలో పాల్గొన్న శిద్దా

తిరుమంజన సేవలో మాజీ మంత్రి శిద్దా

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీపద్మావతి దంపతులు, టిటిడి బోర్డు సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్ శృతి దంపతులు తిరుమంజన సేవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. శనివారం ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ జీర్ణోద్ధరణ కైంకర్య పోషకులు శిద్దా హైమావతి, శిద్దా వెంకటేశ్వరరావు దంపతులు, శిద్దా సూర్యప్రకాశరావు దంపతులు, శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు పాల్గొన్నారు.

సహాయ కార్యదర్శిగా 'బాలునాయక్'

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా మార్కాపురం ఎడిజె కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న ఆర్ బాలునాయక్ ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి గుంటూరు క్లబ్‌లో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర బార్ అసోసియేషన్ సమావేశంలో బాలు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

వైష్ణవిలో సూరగాని లక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఐక్యంగా జరుపుకొనే పండగ

ప్రజాశక్తి - చీరాల

తెలుగు సాంప్రదాయాలను గౌరవిస్తూ అందరూ ఆహ్లాదకరంగా ముగ్గులతో, భోగిమంటలతో, పిండి వంటలతో ఐక్యంగా సంతోషంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని బీసీ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, శ్రీ వైష్ణవి ఎవెన్యూ కమిటీ ప్రసిడెంట్, వైసిపి కౌన్సిలర్ సూరగాని లక్ష్మి అన్నారు. స్థానిక వైష్ణవి అపార్ట్మెంట్లోని మహిళలతో ఆమె ఆధ్వర్యంలో తొలిసారిగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని రంగులతో రంగవల్లు అందంగా అలంకరించారు. పోటీల్లో గెలపొందిన విజేతలతో పాటు ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అంద జేశారు. ఈ పోటీల్లో లక్ష్మి, సుజాత, ఉషా, విజయలక్ష్మి, సౌమ్య, లీలా, శ్రావణి, జూన్సీ, లాస్య పాల్గొన్నారు.

హనిమిరెడ్డి సమక్షంలో వైసిపిలో భారీ చేరికలు

టిడిపి నుంచి వైసీపీలో చేరిక

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన 200 కుటుంబాల వడియ రాజులు వైసీపీ ఇంచార్జి పానెం హనిమిరెడ్డి సమక్షంలో వైసీపీలో శనివారం చేరారు. వారికి హనిమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వైసీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, ఎఎంసి మాజీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసిపి మండల ఇన్ చార్జి కె మహేష్, ఊట్ల నాగేశ్వరరావు, వల్లెపు నాగరాజు, అంకమ్మరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జెడి శీలం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సాలెంరాజు

కాంగ్రెస్‌లో చేరిన సాలెంరాజు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాలెంరాజ్ శనివారం మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాజకీయ పార్టీల స్వార్ధ ప్రయోజనాలతో రాష్ట్ర అభివృద్ధి దూరమైందని, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. రాజకీయ ఆనిచ్చితి కారణంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఎన్నికల్లో కాంగ్రెస్‌లో పని చేయాలనే దృక్పథంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈపాటికే ఎన్నో ఏళ్లుగా గ్రేస్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు దగ్గరగా ఉంటూ ప్రజాసేవ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ ఆంధ్ర రాష్ట్రంలో కొంత ప్రజలకు దూరమైనప్పటికీ ప్రస్తుతం పాలిస్తున్న ప్రాంతీయ పార్టీలతో అభివృద్ధి కనుమరుగైందని అన్నారు. దీనిని గుర్తించిన ప్రజలు మరో మారు కాంగ్రెస్ కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు.

రైతులు, దళితుల సమస్యలు తెలుసు..

పరిచయ వేదికలో విశ్రాంత ఐఆర్ఎస్ ప్రసాదరావు

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో రైతులు, దళితుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా, ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రబాబు ఆశయ సాధనకై బాపట్ల పార్లమెంటు స్థానం నుండి టిడిపి అభ్యర్థిగా పోటీ చేయాలని, పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ భవన్ ప్రాంగణంలో అంగ రంగ వైభవంగా ఏర్పాటు చేసిన ప్రజాపరిచయ వేదికపై ఆయన మాట్లాడారు. బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ప్రజలు గుర్తెరిగిన వ్యక్తిగా, వృత్తిపరంగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రజాసేవకు పునరంకితం అవుతామన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మయన్మార్, ఆస్ట్రేలియా నుండి వ్యవసాయ ఉత్పత్తులు భారతదేశానికి దిగుమతి చేసుకోవడమే ప్రధాన కారణం అన్నారు. దేశంలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. ఈ ప్రాంతంలో

పరిచయ వేదికలో మాట్లాడుతున్న దగ్గుమల్ల ప్రసాదరావు

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశాలంగా విస్తరించి ఉన్న సముద్ర తీరానికి అనుసంధానంగా పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. అనేక సమస్యలతో సతమతం అవుతున్న ప్రజల గోడును పార్లమెంటులో వినిపించేందుకు టిడిపి ఎంపి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లోని నాయకులు, ప్రజల పరిచయం కోసం సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనసేన జిల్లా ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన అంతమొందించేందుకు టిడిపి ఎంపీ అభ్యర్థిగా సుందరరావు పోటీ చేస్తే వారి విజయానికి జనసేన పూర్తి సహకారం అందిస్తుందన్నారు. తొలుత పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్ నుండి ఓపెన్ టాప్ జీపుపై ప్రజలకు అభివాదం చేస్తూ పరిచయ వేదిక ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు తేళ్ల అరుణ, టిడిపి రాష్ట్ర ఎస్ఎస్ఎల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరరావు, కోటి ఆనంద్, సంతనూతలపాడు టిడిపి నాయకులు రంపతోటి అంకారావు, కంచర్ల సతీష్, దేవరపల్లి బాబురావు, సత్తెనపల్లి ఎఎంసీ మాజీ చైర్మన్ మొక్కపాటి రామచంద్రరావు, సత్య పల్లవి, గోవిందరావు, చింతగుంపల ప్రాంత టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల పట్టణంలో ఓపెన్‌టాప్ జీబుపై ర్యాలీ

జీతాలు పెంచే వరకు నిరవధిక నిరాహారదీక్షలు

బాపట్లలో అంగన్‌వాడీల నిరసన ధర్నా

మార్టూరులో భోగి మంటల్లో నోటీసులు దగ్ధం

చీరాల తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్‌వాడీల వేతనాలు పెంచే వరకు అవసరమైతే నిరవధిక నిరాహారదీక్షకు పూనుకుంటామని అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరగా 24గంటల రిలే నిరాహార దీక్షలు ఏడవ రోజుకు చేరాయి. తాజాగా కోటి సంతకాల సేకరణను చేపట్టారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వం జరిపిన చర్చల్లో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని మాత్రమే చెప్పారని అన్నారు. ఎంత మేర పెంచుతారు. ఎప్పటి నుండి పెంచుతారనే అంశంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడే వరకు విధులకు హాజరయ్యేది లేదన్నారు. క్రిస్మస్, జనవరి ఫస్ట్ పండుగలు రోడ్లపై జరుపుకున్నట్లే సంక్రాంతిని సైతం జగన్ పుణ్యమాని రోడ్లమీదే జరుపుకుంటామని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల ఆవేదన అర్థం చేసుకోవాలన్నారు. జీతాల పెంపుపై సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టి కేంద్రీకరించాని కోరారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, హేమమాలిని, గీత, లత, శ్రీలత, శైలశ్రీ పాల్గొన్నారు.

సంతమాగులూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం చేస్తున్న సమ్మె 33వ రోజుకు చేరింది. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మనసు మారి తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడి నాయకులు మస్తాన్ బి, శ్రీదేవి, ఎస్తేరా రాణి, నిర్మల, ఆదెమ్మ, రమణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

రేపల్లె : సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అదిరేది – బెదిరేది లేదని, సమ్మె కొనసాగిస్తాం. జగనన్నకి చెబుదాం పేరుతో ప్రజల వద్ద నుంచి సంతకాలు శనివారం సేకరించారు. పట్టణంలోని షాపుల వద్ద, మేధావులుగా ఉన్న న్యాయవాదుల పోరాట శిబిరం వద్ద సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలతో నిర్వహించిన చర్చల్లో వేతనాలు పెంపుదల గురించి స్పష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మెను విరమించకపోతే తొలగిస్తామని, లేకుంటే ప్రత్యామ్నయం చూసుకుంటామని బెదిరింపులు మానుకోవాలని అన్నారు. నేటి నుండి ప్రజల వద్ద నుండి కోటి సంతకాలు సేకరించి, తమ డిమాండ్స్‌పై ప్రజలు మద్దతు కూడగట్టి జగన్‌కు పంపిస్తామని అన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు లక్ష మందే పోరాటం చేస్తున్నారని అనుకుంటున్న జగన్ తాము కోటి సంతకాలు స్వీకరించిన తర్వాతైనా పునరాలోచించుకుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై మేరీమణి, ఎన్ కృష్ణకుమారి, డి జ్యోతి, బేబీరాణి, రజిని, జయప్రద, సునీత, లావణ్య పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ కార్యకర్తలు అధికార పార్టీ నాయకులకు ఓట్లేసి గెలిపించి అందలమెక్కించినందుకు తమకు ఇలా జరిగిందని నెత్తిపై పైట చెంగు కప్పుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి సుబ్బారావు, అంగన్‌వాడి లీడర్స్ సౌభాగ్య, లక్ష్మి, నగరాజకుమారి, భాగ్యం, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మోకాళ్ళపై కూర్చొని ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిఐటియు నాయకులు కే శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని అన్నారు. తక్షణం ఎస్మా చట్టాన్ని రద్దు చేసి అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని కోరారు. సిఐటియు నాయకులు బి చిన్నదాసు, రైతు సంఘం ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, బండి శంకరయ్య పాల్గొన్నారు.

చీరాల : అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా వంటి చట్టాన్ని ప్రయోగిస్తూ వారిని భయ భ్రాంతులకు గురిచేయటం దుర్మార్గమైన చర్యని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె నెల రోజులకు చేరిందని అననారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజిబెత్ మాట్లాడుతూ నెల రోజులుగా సమ్మె చేస్తుంటే ఇప్పుడు హఠాత్తుగా ఐసిడిఎస్‌ని అత్యవసర సర్వీసుగా ప్రకటించి వారిపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం బ్లాక్ మెయిల్‌గా ఉపయోగ పెట్టుకోవడానికి ఈ చట్టం తీసుకొచ్చారని అన్నారు. వేతనాలు ఇవ్వడంలో ఏపీ 5వ స్థానంలో ఉందని అన్నారు. దీన్ని కప్పిపుచ్చుతూ 3వ స్థానంలో ఉన్నామని అబద్ధాలు ప్రచారం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకురాలు పి ప్రమీల, జి సుజీవన, శిరీష, బుల్లెమ్మాయి, భూలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : చర్చల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడంలేదని, సిఎం తమను ఆదుకోవాలని కోరుతూ కోటి సంతకాల సేకరణ శనివారం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా తహశీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మనిలాల్ పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : న్యాయమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు విమర్శించారు. సంక్రాంతి పండుగను ఇళ్లల్లో చేసుకోకుండా రోడ్డుమీద చేసుకునే పరిస్థితి తెచ్చిన వైసిపి ప్రభుత్వానికి త్వరలో సరైన గుణపాఠం చెప్పక తప్పుదని అన్నారు. అనంతరం అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించి షో కాజ్ నోటీసులను భోగి మంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాళ్లూరి రాణి, పల్లెపోగు శ్యామల, నాగ పుష్పరాణి, కుసుమ, రాజేశ్వరి, శాంతి, అంకమ్మ పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో అంగన్‌వాడీల నిరసనలు

పర్చూరులో మోకాళ్లపై నిరసన ధర్నా

రేపల్లెలో లాయర్ల దీక్షల వద్ద అంగన్వాడీల సంతకాల సేకరణ

అంగన్వాడీలపై నిరంకుశత్వం తగదు

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-కొండపి

గత 33 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న అంగన్వాడీ అమ్మలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. అంగన్వాడీల ఉద్యమానికి ప్రజా మద్దతు కూడగట్టేందుకు కరపత్రాలు వేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, కోటి సంతకాలు సేకరించేందుకు కార్యకర్తలు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. శనివారం కొండపిలో అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు ఉన్నా కూడా అంగన్వాడీలు అడుగుతున్న జీతాలు పెంచేదిలేదని రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు మాట్లాడటం నిరంకుశ పోకడకు నిదర్శనమన్నారు. అబద్ధపు ప్రచారం, అదిరింపులు, బెదిరింపులతో అంగన్వాడీలను బెదిరించాలని చూడటం అవివేకమని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందుగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుల కెజి మస్తాన్, సిఐటియు మండల కార్యదర్శి గడ్డం వందనం, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ, బి కుమారి, విజయనిర్మల, బి సుజాత తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: రాష్ట్రంలో నెల రోజులకు పైగా అంగన్వాడీలు సమ్మెలో కొనసాగుతున్న ప్రభుత్వం సరైన రీతో స్పందించలేదన్నారు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె శిబిరంలో జివి కొండారెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలు ఏమీ కోరడం లేదన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఉండాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చిందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెలో కొనసాగుతున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. ఈ విషయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చర్చలు సఫలం అయ్యేలా చూడాలని కోరారు. అంగన్వాడీ సమ్మె శిబిరంలో సిఐటియు నాయకులు డి సోమయ్య, పి రుబెన్, ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేర పురాణి లేకుండా పాత పద్ధతిలో మాట్లాడటం సరికాదని ఎల్ఐసి నాయకులు పారా శ్రీనివాసరావు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె 33వ రోజుకి చేరుకుంది. సమ్మెలో టంగుటూరు ప్రాజెక్ట్‌లోని కార్యకర్తలు పాల్గొన్నారు. శనివారం సమ్మెను ప్రారంభించిన పారా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్లు నెరవేర్చే వరకు ఎల్ఐసి యూనియన్ మద్దతు తెలియజేస్తోందన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేర పదే పదే తిప్పుతూ అవమానాలపాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే వారికి అండగా ఉండి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంతకాల సేకరణ

అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణను సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజానీకం, అంగన్వాడీలు సంతకాలు చేశారు.

మార్కాపురంలో మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

అంగన్వాడీల దీక్షా శిబిరానికి వచ్చి వారిని దుర్భాషలాడిన వ్యక్తిపై యూనియన్ నాయకులు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతమంది సుమోలో వచ్చి ఒక అతన్ని దింపి అంగన్వాడీలను నానా దుర్భాషలాడి అవమానించే విధంగా మాట్లాడించారు. నిన్ను ఎవరు తీసుకొచ్చారు. ఎందుకు దుర్భాషలాడుతున్నావని అంగన్‌వాడీలు ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో వారు ర్యాలీగా వెళ్లి ఒంగోలు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచ్ఛిన్నకర శక్తులను ఎవరో పంపిస్తున్నారని, అంగన్‌వాడీలకు రక్షణ కల్పించాలని వారు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, ఒంగోలు ప్రాజెక్ట్ నాయకురాలు సంధ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టంగుటూరు: అంగన్వాడీల సమ్మె 33వ రోజు సందర్భంగా శనివారం టంగుటూరు అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటీయూ నాయకులు మాట్లాడుతూ జగన్ బయటకు వచ్చి అంగన్వాడీల గురించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరైన రీతిలో చర్చలు జరపకపోవటం దుర్మార్గమన్నారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించే విధంగా చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించి బెదిరింపులు చేయటం దుర్మార్గమన్నారు. ఎస్మా చట్టాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా నాయకులు టంగుటూరి రాము, వి మోజెస్, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి శేషమ్మ, కె హేమలత, శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మద్దిపాడు లో అంగన్వాడీలు చేపట్టిన దీక్ష శనివారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వివిధ ఆటలు ఆడి తమ నిరసనను తెలిపారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని వారు మండిపడ్డారు. ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు తమ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు జయప్రద, ధనలక్ష్మి, అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కనిగిరి: కనిగిరి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరసన శనివారం 33వ రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల నిరంకుశ వైఖరి అవలంబిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. ఎస్మా చట్టాన్ని ఉపయోగించి అంగన్వాడీలను బెదిరించలేరని, పోరాటం ఆగదని అన్నారు. పోరాటాలకు ఆదర్శంగా అంగన్వాడీల పోరాటం నిలిచిందన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించటంగానే అన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ

కొండపిలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామసుబ్బులు, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, జెవివి నాయకులు జి శ్రీనివాసులు, ఐద్వా నాయకులు ఎస్‌కె బషీర, శాంతకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత 33 రోజుల నుంచి సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా అంగన్‌వాడీల మీద ఉపయోగించిన ఎస్మా చట్టం ఉపసంహరించుకోవాలని యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు సిహెచ్ రఫియా శనివారం కోరారు. ఆమె సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ సమ్మెలో చనిపోయినవారికి సంతాపం ప్రకటించారు. అనంతరం ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తహశీల్దారు నేలతోటి వాసుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల అనురాధ, నారాయణమ్మ, పెద్దక్క, మమత, భాగ్యలక్ష్మి, అంకమ్మ, ప్రసన్న, విమలమ్మ, శైలజ, మంజుల, లక్ష్మి, సుజాత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె 33వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా గిద్దలూరు తహశీల్దారు కార్యాలయం ఎదురు అమరావతి, అనంతపూర్ జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టీ ఆవులయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు స్వర్ణ, మున్నా, విజయలక్ష్మి, వరలక్ష్మి, దేవమ్మ, లక్ష్మీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

దర్శి: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె న్యాయమైందని, సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 33వ రోజు అంగన్‌వాడీ సమ్మె కొనసాగింది. ఈ సమ్మెకు మద్దతు స్తూ టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాపారావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 35 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో చంద్రబాబు ఉన్నప్పుడు అంగన్‌వాడీల సమస్యలు తీర్చారని, జగన్ మాత్రం ఏమీ చేయకుండా ఎస్మా చట్టం ద్వారా ఉద్యమాన్ని అణచివేయడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతమ్మ, నాగమణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, నారపుశెట్టి మధు, కాకర్ల సైదా, దత్తాత్రేయ, దినకర్‌లు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, సంధు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తో పాటు అంగన్‌వాడీలు జయమ్మ, బాలమ్మ, ప్రశాంతి, ఫాతిమా, దేవిబాయి, నాగలక్ష్మి, పద్మావతి, లక్ష్మి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 33వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లు పర్కిరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు డికెఎం రఫీ, అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషి, ఎ నాగమల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కె జయమ్మ, ఎ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. శనివారం పెద్దదోర్నాలలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో అంగన్‌వాడీల సంతకాల సేకరణ

కనిగిరిలో సమ్మెలో అంగన్‌వాడీలు

టీడీపీ విజయం కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-కొమరోలు

టిడిపి ప్రకాశం జిల్లా కొమరోలు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు బొనేని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌ఛార్జి టీడీపీ, జనసేనల ఉమ్మడి మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రతి కుటుంబానికి వివరించాలని, టీడీపీ జనసేనల ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను తెలియచేయాలని, ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త గ్రామస్థాయిలో కష్టపడి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, టీడీపీ సర్పంచులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

ప్రజాశక్తి-దొనకొండ

ప్రజల సమస్యలు పరిష్కరించని మండల సమావేశాలు ఎందుకంటూ అధికార పార్టీకి చెందిన సభ్యులు సమావేశంలో వాపోయారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల పరిధిలో ప్రభుత్వ పథకాల గూర్చి వివరించారు.

చిన్న చిన్న సమస్యలు కూడా..

ఈ సందర్భంగా దొనకొండ ఎంపీటీసీ సభ్యురాలు గుంటు అమ్మాజీ మాట్లాడుతూ తమ పరిధిలో చిన్న చిన్న సమస్యలు సయితం పరిష్కారం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల బెడద వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని నివారించాలని కోరారు. బ్రహ్మారావుపేటలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయం తెలిపినా పట్టించుకోవటం లేదని, కనీసం వీధిలైట్లు కూడా వేయించుకోలేని పరిస్థితుల్లో తాము ఉన్నామని వాపోయారు. అందుకు దొనకొండ సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి స్పందించి బ్రహ్మారావుపేటలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా వీధిలైట్ల సమస్య ఏర్పడిందని అన్నారు. కోతుల నివారణపై ఉన్నతాధికారు లతో చర్చిస్తున్నామని త్వరలో అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని అన్నారు. సంగాపురం సర్పంచ్ భీమనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమావేశాల్లో చర్చించిన కొన్ని సమస్యలు పరిష్కారం కావటంలేదని, దీంతో సమావేశాల కు వెళ్లినా ప్రయోజనం లేదని పలువురు ప్రజాప్రతినిధులు డీలా పడ్డారన్నారు. గ్రామాల్లో తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేనే కోరిక నెరవేరటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సువర్ణ, ఎంపీడీఓ వసంతరావునాయక్, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కనకదుర్గ

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు కాశినాయన ఆశ్రమంలో మైలా నాగిరెడ్డి ఆర్థిక సహకారం తో పేదలకు దుప్పట్లను శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు గుంటక సుబ్బారెడ్డి, కుందురు బాలిరెడ్డి, రావి చెంచిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, కుందురు రమణారెడ్డి, గోగిరెడ్డి నారాయణరెడ్డి, తిరుమలరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదవాళ్లకు అండగా ఉంటా: హనిమిరెడ్డి

ప్రజాశక్తి -పంగులూరు

నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని, తనను కుటుంబంలో సభ్యుడిగా చేర్చుకోమని, వైసిపి ఇన్చార్జి పానెం హనిమిరెడ్డి కోరారు. మండలంలోని ముప్పవరంలో శనివారం ఏర్పాటు చేసిన వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశ పరిచయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అడుగుపెట్టినప్పటి నుండి ప్రజలు తనను ఎంతో ఆత్మీయంగా చూస్తున్నారని అన్నారు. తాను కూడా తన కుటుంబంలో ఎలా ఉంటానో మీతో కూడా అలాగే ఉంటానని అన్నారు. ఏ సమయంలో ఫోన్ చేసినా మాట్లాడుతానని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడుతానని అన్నారు. అందరూ ఐక్యంగా ఉండి వైసిపిని గెలిపించి సిఎంకు కాకుగా ఇద్దామని అన్నారు. మును

సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

పెన్నడూ లేనంత భారీ మెజారిటీతో గెలవాలని కోరారు. ఇదే విషయాన్ని సిఎంకు కూడా చెప్పానని అన్నారు. తొలుత ఎఎంసి మాజీ చైర్మన్ వైవి బద్రారెడ్డి, వైసీపీ నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బివి కృష్ణారెడ్డి మాట్లాడారు. వైసిపి మండల నాయకులు స్వయంపు హనుమంతరావు, బట్రాజు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చక్రవరం జ్యోతిభాస్కరరాజు, ఎంపీపీ తేళ్ళ నాగమ్మ, వైసీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు పులికం కోటిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పల్లపు రాము, వైసీపీ ప్రచార జిల్లా అధ్యక్షులు జంపాన్ రవిబాబు, వైసిపి నాయకులు పసుమర్తి సుధాకర్, బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కరరాజు, సర్పంచుల సంగం మండల అధ్యక్షులు స్వయంపు సురేషు, ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపాగు రవీంద్ర, ముప్పవరం సర్పంచ్ రౌతు సాంబశివరావు, వైయస్సార్ రైతు సంఘం మండల అధ్యక్షులు తోట రామాంజనేయులు, డీలర్ల సంఘం అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెన్నై జట్టు ఘన విజయం

టాస్ వేస్తున్న ఎంపైర్

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఆర్ఎస్ సిఎ ఆధ్వర్యంలో రావినూతలలో జరుగుతున్న శ్రీ భ్రమరా సంక్రాంతి క్రికెట్ కప్ పోటీల్లో శనివారం శ్రీ సిసి చెన్నై, జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు విజయాలు సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో శ్రీ సీసీ చెన్నై, వైట్ ఫీల్డ్ క్రికెట్ అకాడమీ బెంగళూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చెన్నై జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటిగా బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు 19.2 ఓవర్లలో 115 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో వెంకటేష్ ఒక్కడే 38బంతులకు 53 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన శ్రీసీసీ చెన్నై జట్టు 13.4 ఓవర్లలో రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి 117పరుగులు చేసి ఎనిమిది వికెట్ల విజయం సాధించింది. తరుణ్ 51, అభి 44 పరుగులు చేశారు. మెన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తరుణ్ ఎంపిక అయ్యాడు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌వైసిసి హైదరాబాద్, జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు తలపడగా హైదరాబాద్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 130పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన చెన్నై జట్టు 15.3 ఓవర్లలో 3వికెట్లు మాత్రమే కోల్పోయి 131 పరుగులు చేశారు. దీంతో ఏడు వికెట్ల విజయం సాధించింది. చెన్నై జట్టులో సుదీప్ 50 పరుగు చేసి అర్థ సెంచరీ నమోదు చేశాడు. మాన్ ఆఫ్ ది మాచ్‌గా ఎంపికయ్యారు. ఈ మ్యాచ్‌లను ఆర్ఎస్ సిఎ అధ్యక్షులు కారుసాల నాగేశ్వరరావు, కారుసాల ప్రదీప్, రామినేని శ్రీనివాసరావు, నరసింహా రావులతో పాటు అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో మ్యాచ్‌లు జరిగే విధంగా నిర్ణయాలు .తీసుకుంటు న్నారు. నేటి మ్యాచ్లు. ఉదయం థండర్ బోర్ట్స్ తిరుపతి వర్సెస్ శ్రీసీసీ చెన్నై, మధ్యాహ్నం ప్రసాద్ ఫోర్స్ 11 హైదరాబాద్ వర్సెస్ జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు తలపడనున్నాయి.

సుదీప్

ఆపన్నలకు అండగా డిబిఆర్‌సి

ప్రజాశక్తి - చీరాల

ఇటీవల మిచాంగ్ తుఫాను ప్రభావ నేపథ్యంలో ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురైన అభాగ్యులకు సహాయంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆదుకొని అండగా ఉంటుందని డిబిఆర్సి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ అన్నారు. డిబిఆర్‌సి ఆధ్వర్యంలో బాధితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని విఠల్ నగర్, రోశయ్య కాలనీ, ఈపురుపాలెం ప్రాంతాల్లో ఎంపిక చేసిన 100 కుటుంబాలకు ఇంటికి రూ.4వేల చొప్పున నగదు బదిలీ బ్యాంకు ఖాతాల ద్వారా జమ చేసినట్లు తెలిపారు. డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ విభగవాన్‌దాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ డిబిఆర్‌సి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తుందని అన్నారు. ప్రజలందరికీ సమానమైన హక్కులు ఉండాలని కాంక్షిస్తుందని తెలిపారు. మిచాంగ్ తుఫాన్ తీర ప్రాంతాల్లో వారిని కష్టాల పాలు చేసిందని అన్నారు. వేస్ట్ పిక్కర్లు, సంచార జాతులు అణగారిన వర్గాల ప్రజలు

మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్

మరింత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. నగదు బదిలీకి తమకు తోడ్పాటుని అందించిన క్రిస్టియన్ ఎయిడ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్, అనిల్ కుమార్, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బి రమణమూర్తి, డిబిఆర్సి రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్లు పి వీరయ్య, శ్రీలత, ధనరాజ్, కాలనీ పెద్దలు జానీ భాష, వంశీ, వీరన్, సురేష్, మణి, విజయ్, ఏకలక్ష్మి, కావేరి పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపిద్దాం : నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుని రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చుదామని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి, మీ మాటే – నా బాట, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలను మండలంలోని

చీరలు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

నందిరాజు తోట, పిట్టలవానిపాలెం మండలం కోమలి, రెడ్డిపాలెం గ్రామాల్లో టిడిపి నాయకులతో కలసి నిర్వహించారు. మహిళలకు చీర, కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి టిడిపితోనే సాధ్యమన్నారు.

నాటికపోటీలు ప్రారంభిస్తున్న పెరవలి శ్రీనివాసరావు

ప్రజల ప్రోత్సాహం బాగుంది

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో శనివారం రాత్రి ఎన్‌టిఆర్ కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల ద్వితీయ నాటికల పోటీలు జరిగాయి. 3వ రోజు నిశబ్దామా నీ ఖరీదెంత, ప్రక్షాళన, మిణుగరు వెలుగులు, నాటికలను ప్రదర్శించారు. మొదటి నాటికకు విజయ్ డిజిటల్స్ రూ.20వేలు, 2వ నాటికకు గుదే సిస్టర్స్ రూ.20వేలు, 3వ నాటికకు కళాపరిషత్ రూ.20వేలు పారితోశకం అందించారు. పోటీలకు బొప్పూడి కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అరెకట్ల ప్రసాద్, కెనరా బ్యాంకు మేనేజర్ పెడవల్లి శ్రీనవాసరావు హాజరు అయ్యారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు పాండు రంగారావు, ఆర్ శ్రీను, ఈశ్వరప్రసాద్, పాపరాజు, రాధ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఆమంచి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఋగ్వేద క్రికెట్ మైదానంలో సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమైనాయి. పోటీలను వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ బ్యాటింగ్ చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఝూర?ండ్, కర్ణాటక, గోవా, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి 16జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్ బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడ్డాయి. ఈ టోర్నమెంట్‌లో రూ.3లక్షలు, రూ.2లక్షలు, రూ.ఒక లక్ష చొప్పున వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నారు. భారీగా నగదు బహుమతులే కాకుండా వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులు ఉన్నట్లు నిర్వాహకులు తులసి శివనాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వంశీ కృష్ణ, నీరుకట్టు వాసుబాబు, ఉప్పలపాటి అనిల్, కోటా శ్రీనివాసరావు, జంగా అనిల్, ముప్పాళ్ల రాఘవయ్య, కంచెనపల్లి రమేష్, గాదె సురేష్, నాగేశ్వరరెడ్డి, ఇస్సాకు, రోశయ్య పాల్గొన్నారు. మండలంలోని నూతలపాడు గ్రామం నందు సత్రం యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను వైసిపి ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభించారు. ఆట పాటలతో పండుగ వేడుకలు సాంప్రదాయ బద్దంగా చేసుకోవాలని అన్నారు.

టిడిపి గౌడ సంఘ కన్వీనర్‌గా సురేంద్ర

ప్రజాశక్తి- పంగులూరు

గొట్టిపాటి రవితో సురేంద్రగౌడ్

టిడిపి గౌడ సాధికారిక సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా ముప్పవరం గ్రామానికి చెందిన ఏమినేని సురేంద్ర గౌడ్ ఎంపికయ్యారు. రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం ప్రెసిడెంట్ అశోక్ గౌడ్ ద్వారా సురేంద్ర గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర గౌడ్ మాట్లాడుతూ టిడిపి గౌడ్ సాధికారత సంఘం కన్వీనర్‌గా ఎంపిక కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తన ఎంపికకు సహకారం అందించిన ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్‌కు, బీసీ సాదికారిత సంఘం రాష్ట్ర కన్వీనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణకు ఎస్ఐల అభినందనలు

రూరల్ సిఐగా నిమ్మగడ్డ

ప్రజాశక్తి - చీరాల

రూరల్ సీఐగా నిమ్మగడ్డ సత్యనారాయణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్చార్జి సీఐగా సోమశేఖర్ ఉండగా ప్రస్తుతం రెగ్యులర్ సీఐగా సత్యనారాయణ ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో నిమ్మగడ్డ సత్యనారాయణ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐగా విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రశాత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని అన్నారు. లా అండ్ ఆర్డర్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ తరుణంలో ఆయనను పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో వడ్డిస్తున్న సజ్జా వెంకటేశ్వరరావు

ఆకలి తీరుస్తున్న 'అన్నా క్యాంటీన్'

ప్రజాశక్తి - చీరాల

పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో టిడిపి అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తోందని టిడిపి నాయకులు సజ్జా వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన తన సొంత నిధులతో మంగళగిరిలోని అన్నా క్యాంటీన్లో భోజనాలను ఏర్పాటు చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్నట్లు తెలిపారు. ఎన్టీ రామారావు స్ఫూర్తితో ప్రారంభించిన అన్న క్యాంటీన్ నిర్వహణలో భాగంగా ప్రతిరోజు 300 మందికిపైగా భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సజ్జా బాలానందం ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని అన్నా క్యాంటిన్‌లో 511వ రోజు భోజనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు టిడిపిని స్వాగతిస్తున్నారని, జరగబోయే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేయాలని కోరారు. ఐక్యత కృషిచేసి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

టిడిపి సంక్రాంతి కానుక

ప్రజాశక్తి - అద్దంకి

ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు తెలుగు యువత నాయకులు కొనేటి అనిల్ ఆధ్వర్యంలో స్థానిక 20వ వార్డులో 200మందికి సంక్రాత్రి కానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లం అంజయ్య, అల్లం వెంకన్న, అల్లం కొండయ్య, సాయిలు, వెంకట్రావు, దుర్గ, చిట్యాల హనుమ పాల్గొన్నారు.

కానుకల పంపిణీ

రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకే అక్రమ కేసులు

టీడీపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేక సిఐడిని తన గుప్పెట్లో పెట్టుకొని అక్రమ కేసులు బనాయించారని టిడిపి పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. టిడిపికి, చంద్రబాబుకు ప్రజల నుంచి విశేష స్పందన రావడాన్ని ఓర్వలేక జగన్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతుందన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్ తీరును, పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ జేబు సంస్థ అయిన సీఐడీని అడ్డం పెట్టుకొని చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు, నీలి మీడియాలో దుష్ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు. వైసిపి ఎమ్మెల్యేల, ఎంపీల అసమ్మతిని కప్పి

ఎంఎల్ఎ ఏలూరి

పుచ్చుకునేందుకు చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. జగన్ ఒత్తిడితో సీబీఐ నమోదు చేసిన కేసుల్లో చంద్రబాబు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయో జనం పొందినట్టు సీఐడీ ఎలాంటి ఆధారాలను కోర్టుకు చూపలేకపోయిందని, హైకోర్టు వ్యాఖ్యానించి బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. జగన్‌రెడ్డిపై 38కేసులు నమోదై ఉన్నాయని ఆరోపించారు. రూ.43వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జిషీట్లు కూడా వేసిందని అన్నారు. తాను నేరం చేయకపోతే, శిక్ష పడుతుందనే భయం లేకపోతే కోర్టు విచారణలకు హాజరై తుది తీర్పు పొందవచ్చు కదా? అని ప్రశ్నించారు. శిక్ష పడుతుందనే భయంతోనే కోర్టు విచారణలకు హాజరు కావడం లేదని అన్నారు. 12ఏళ్ల నుంచి 3,500 వాయిదాలు తీసుకున్నారనేది నిజం కాదాని ప్రశ్నించారు. 2004లో రూ.1.73కోట్లు మాత్రమే ఆస్తి కలిగిన జగన్‌రెడ్డి 19ఏళ్లలో రూ.4లక్షల కోట్లకు ఎలా అమాంతం పెరిగాయన్నారు. ఇలా ఆస్థులు పెంచుకున్న సిఎం దేశంలో ఎవ్వరూ లేరని అన్నారు. రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి లక్షల కోట్లు కొల్లగొట్టారని అన్నారు. 16లిస్టెడ్ కంపెనీలు, మరో 50 సూట్ కేస్ కంపెనీలు, వేలాది ఎకరాలు, 5నగరాల్లో ప్యాలెస్‌లు ఆయనకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. 2004లో హైదరాబాదులో వున్న ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న జగన్ 19ఏళ్లల్లోనే రూ.4లక్షల కోట్లు ప్రజా సంపద కొల్లగొట్టారని మండిపడ్డారు.

అన్నంబొట్లవారిపాలెంలో ఉత్సాహంగా ఎడ్ల పందాలు

అట్టహాసంగా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబొట్ల వారిపాలెంలో 36వ జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. నేడు జూనియర్స్ విభాగంలో తెలుగు రాష్ట్రాల నుండి ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలు ఈనెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈనెల 13న పోటీలు పందాలు నిర్వహించ నున్నట్లు చెప్పారు.

బాపట్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 15న మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పట్టణంలో 14వ రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాపు సేవా సంఘం నాయకులు శనివారం తెలిపారు. ఎడ్ల పోటీల్లో పాల్గొనదలచిన ఎడ్ల జతల యజమానులు ఈనెల 14 సాయంత్రంలోపు నిర్వాహకుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నాటు బండి ఆకు రాధా పద్ధతిలో పోటీలు ఉంటాయని అన్నారు. మొదటి నుండి 6వరకు బహుమతులు సాధించిన ఎడ్ల జతకు రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. డ్రా పద్ధతి ద్వారా పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతలు, యజమానుల పేర్లు నిర్ణయిస్తారని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న ఎడ్ల జత యజమానులకు భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఫీల్డు అసిస్టెంట్‌కు హనిమిరెడ్డి నివాళి

ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని సజ్జాపురం ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అనంతవరపు సుబ్బారావు (40) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి సోదరుడు కైపు మహేష్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు భౌతికయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, ఓరుగంటి కోటిరెడ్డి, బొల్లినేని రామకృష్ణ, తేలప్రోలు వెంకట్రావు, వూట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి నవమోసాలు : ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

జొన్నతాళి క్యాంపు కార్యాలయంలో బల్లికురవ మండలం కొండాయపాలెం, అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామాల బూత్ ఏజెంట్లు, పేజి నేస్తం సభ్యులతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ నమోదు పూర్తి, ఓటరు జాబితా పట్ల అప్రమత్తత, ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫేస్టో పథకాలను వివరించేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదు గానీ నిత్యావసర ధరలన్నీ పెరిగాయని అన్నారు. టీడీపీ హయాంలో రూ.70ఉన్న పెట్రోల్ నేడు రూ.110కి పెరిగిందని అన్నారు. డీజిల్ రూ.70 నుంచి రూ.99కి పెరిగిందని అన్నారు. రూ.40బియ్యం రూ.60కి పెరిగాయి. రూ.87ఉన్న కందిపప్పు రూ.140కి, పంచదార రూ.26నుండి రూ.45 చేరిందని అన్నారు. వంట నూనె రూ.60నుంచి రూ.130కి, గ్యాస్ రూ.726నుంచి రూ.1176కి పెరిగిన ధరలతో మళ్లీ కట్టెల పొయ్యిపై ఆడబిడ్డలు వంట చేసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు. విదేశీ విద్య, పెళ్లి కానుక, చంద్రన్న బీమా, స్టడీ సర్కిళ్ల

సమావేశంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

వంటి అనేక కార్యక్రమాలు రద్దు చేసి దమనకాండ సాగిస్తున్నారని అన్నారు. జగన్ రెడ్డి మోసకారీ సంక్షేమంతో పేదల్ని మరింత పేదలుగా మార్చాడని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు స్వయం ఉపాధి రుణాలు చంద్రబాబు అందిస్తే, జగన్‌రెడ్డి ఇన్నేళ్లలో ఒక్క వర్గంలో ఒక్క యువకుడికి కూడా రూపాయి రుణం ఇవ్వలేదన్నారు. అమ్మఒడి పేరుతో రూ.13వేలు ఇచ్చి నాన్నబుడ్డి కింద ఏటా రూ.75వేలు కొట్టేస్తున్నాడని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు రూ.10వేలు ఇచ్చి ట్యాక్సులు, పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ఏటా లక్షకుపైగా వసూలు చేస్తున్నారని అన్నారు. బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించింది నిజం కాదా? అని ప్రశ్నించారు.

'బాబుతోనే భవిష్యత్': గూడపాటి

ప్రజాశక్తి - రేపల్లె

టీడీపీదే అధికారం. బాబుతోనే భవిష్యత్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పరిశీలకులు గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ శ్రేణులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో

సమావేశంలో పరిశీలకులు జి శ్రీనివాసరావు

ఆయన మాట్లాడారు. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలు ప్రతి ఇంటికి చేరే విదంగా చూడాలన్నారు. భవిష్యత్తు చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతి ఇంటికి టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా పనిచెయ్యాలని కోరారు. అవినీతి, అరాచకం చేస్తున్న సైకో పాలనతో ప్రజలు విరక్తి చెందారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సైకోను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం, భవిష్యత్తుకు గ్యారంటీని ప్రజలకు చేరువ చేయాలన్నారు. గ్యారంటీ పత్రాల్లో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి పథకాలను వివరించాలని తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం క్రింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా చేస్తామని అన్నారు. అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులుగా మార్చే పనులు అమలు చేయనున్నట్లు చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు జయహో బీసీ నిర్వహించాలని అన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఆటో డ్రైవర్లు అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావు అన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ గోపితో కలసి ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆటో డ్రైవర్లు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రయాణికులకు కేటాయించిన పాయింట్లలో ఆటోలు నిలుపుదల చేసుకోవాలని పట్టణంలో అడ్డగోలుగా ఆటోలు నిలుపుదల చేసిన, మద్యం సేవించి ఆటోలు నడిపనా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరించిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

జాతీయ రహదారిపై పుట్టావారిపాలెం జంక్షన్ వద్ద ట్రాఫిక్

ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్‌లో శనివారం ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. ఈ జంక్షన్‌కు సంక్రాంతి తాకిడి తగిలింది. తెలంగాణ వైపు నుండి వస్తున్న వేలాది వాహనాలు ఈ జంక్షన్‌లో అష్టదిగ్బంధనానికి గురౌతున్నాయి. ఏదైనా వాహనం నిమిషం మాగితే చాలు వేలాది వాహనాలు కిలోమీటర్ల పొడవున నిలబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ నుండి భారీ సంఖ్యలో వాహనాలు ఒంగోలు వైపు, గుంటూరు, కర్నూలు వైపు వెలుతున్నాయి. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ చేసే పోలీసులు కూడా లేకపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో అటువైపుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెలమవారిపాలెంలో వైసిపి ఇన్‌చార్జి హనిమిరెడ్డి

'మళ్లీ జగనన్న ప్రభుత్వమే.'

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలో వెలమవారిపాలెం గ్రామంలో పల్లె పల్లెకు హనిమిరెడ్డి నినాదంతో కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైసిపీ ఇంఛార్జి పానెం హనిమి రెడ్డి గ్రామానికి విచ్చేశారు. ఆయనకు గ్రామ వైసిపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని మహానేత డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇక రాబోయే ఎన్నికల్లో మరొకసారి సిఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మీ కుటుంబ సభ్యుడిగా తనను భావించి వచ్చే ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇచ్చి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తమ ప్రభుత్వం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి సురేష్, వైస్ ఎంపీపీ ఇప్పల వెంకట సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆమంచి పరామర్శ

ప్రజాశక్తి - పర్చూరు

ఇటీవల రోడ్ ప్రమాదంలో గాయపడిన పర్చూరు మండలం దేవరపల్లి గ్రామం వాస్తవ్యులు వైసీపీ నాయకులు తోకల కృష్ణమోహన్‌ను ఆయన స్వగృహం నందు వైసిపీ ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ పరామర్శించారు. ఆమంచి వెంట పర్చూరు నియోజవర్గంలోని వైసిపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హెూదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

తోకలను పరామర్శిస్తున్న ఆమంచి

సామాజిక రక్షణ చట్టం చేయాలి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభ డిమాండ్

ప్రజాశక్తి-చీరాల
రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి వత్తిదారుడికి పెన్షన్ ఇవ్వాలని, రజక వత్తి చేస్తున్న వాళ్లందరికీ 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వృత్తిదారుల సంఘం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చీరాల అంబేద్కర్ భవన్‌లో జిల్లా రజకుల ఆత్మీయ సభ శనివారం నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో రజకులకు చేసిందేమీ లేదని, రజక వత్తిలో వచ్చిన అనేక మార్పుల్లో రజక వత్తిదారులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, వృత్తిలోకి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులు ప్రవేశించినందువలన అధునాతనమైన పరికరాలు కొనుగోలు చేసి పెద్ద పెద్ద కార్ఖానాలు ఏర్పాటు చేసుకోలేక పాత పద్ధతిలోనే రజక వృత్తిదారులు కునారిల్లుతున్నారని అన్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వాలు మోడ్రన్ ధోబీ గాట్స్ కట్టించి కొన్ని పట్టణ కేంద్రాల్లో కొద్దిమందికైనా ఉపాధి కల్పిస్తున్నారని అలాగే ప్రతి రజక వృత్తిదారుడికి సపరేట్గా కరెంట్ మీటర్ బిగించి 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని అన్నారు. కానీ మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వల్ల రజకులకు ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు మంత్రులను, మున్సిపల్ సెక్రెటరీని కలిసి రజకుల సమస్యలు వినతి పత్రం రూపంలో తీసుకెళ్లిన, అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన ఈ ప్రభుత్వం రజకులను పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ఇప్పటికైనా ఐదారు శాతం జనాభా ఉన్న రజకుల ఓట్లు కావాలనుకుంటే రజక వత్తిలో 50 సంవత్సరాలు దాటిన వాళ్లకి పెన్షన్లు, మోడ్రన్ ధోబీ గాట్స్, 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు రజకులకు ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం రజక వృత్తి దారుల క్యాలెండర్ ను వేపూరి కుమారి ఆవిష్కరించారు. చేతి వృత్తుదారుల క్యాలెండర్ ను న్యాయవాది, బీసీ ఫెడరేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మస్తానరావు ఆవిష్కరించారు. అనంతరం రజక వత్తి దారుల సంఘం బాపట్ల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పేరాల జనార్ధన్, పి కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలూరి సింగయ్య, మరో 14 మందితో జిల్లా కమిటీ ఎనుకున్నారు. చీరాల పట్టణ రజక వత్తి దారుల సంఘం అధ్యక్షులు గడేపూడి బ్రహ్మయ్య, కార్యదర్శి పొదర్తి సాయిరాం, మరో ఏడుగురితో కమిటీ ఎన్నుకున్నారు. రజకుల చెరువులు, గుంటలకు రక్షణ కల్పించాలని తీర్మానించారు. సమావేశంలో టి రాఘవయ్య, రత్తయ్య, మోహనరావు, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబూరావు, ఎం వసంతరావు, టిప్ టాప్ శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మన్నూరు భాస్కరయ్య

దిగ్గజాల దిగాలు

జిల్లాలో రాజకీయ దిగ్గజాలు దిగాలు పడ్డ వేళ. భవిష్యత్ మసకబారుతోన్న తరుణం.. తాము ఉన్న పార్టీల్లో టిక్కెట్లు రాక వేరే పార్టీల వైపు చూసే దైన్యం.. రాజకీయ భవిష్యత్తు ఎంత వెతికినా కనిపించని దారులు.. వెరసి జిల్లాలో సీనియర్ రాజకీయ నేతల పరిస్థితి ఇలా కొట్టుమిట్టాడుతోంది. ఒకరిద్దరు కాదు. అందరి పరిస్థితీ ఇదే.. నాలుగు సార్లు అసెంబ్లీకి గెలిచి మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ నేతలకూ ఇప్పుడు తిప్పలు తప్పడం లేదు. ఒకనాడు జిల్లా రాజకీయాలను శాసించిన మహా నేతలకు ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. ఇప్పటికీ తాము ఉన్న పార్టీ నుంచి టిక్కెట్టు వస్తుందా? లేదా? అనేదీ స్పష్టత లేదు. అసంతృప్తులు తారాస్థాయికి చేరాయి. అలకలు పెరిగాయి. అసమ్మతులు గుప్పుమంటున్నాయి. అధికారమే లక్ష్యంగా పార్టీలు తీసుకునే నిర్ణయాలు ఇప్పుడు సీనియర్ నేతలకు సవాలుగా మారాయి. అందరూ ఆందోళనగానే ఉన్నారు. వీరి రాజకీయ భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా పాలకపక్షంలో ఉన్న నేతలకే ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి అన్నీ తామై జెండా మోసిన నేతలకూ.. తెలుగుదేశం నుంచి వచ్చిన బడా నేతలకూ ఇద్దరికీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మంత్రులు, ఎంపీలు, మూడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన ఉద్దండులూ ఇప్పుడు అధిష్టానం ఆటలో పావులుగా మారారు. వెనక్కు వెళ్లలేక.. ముందుకు పోలేక నడిసంద్రంలో నావలాగా కొందరు నేతల పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల సమావేశాలు కూడా కీలక నేతలు లేకుండానే జరిగే స్థాయికి వెళ్లాయి. టిక్కెట్ల ఎంపికలో కీలక నేతల సిఫార్సులకు దిక్కుమొక్కూ లేకుండా పోయింది. చక్రం తిప్పే నేతలకే ఇప్పుడు టిక్కెట్టు వస్తుందా? లేదా? అనుకునే పరిస్థితి వచ్చింది. పార్టీలు మారేందుకు పావులు కదుపుతున్నారు. అధిష్టానం సామాజిక సమతుల్యత పేరుతో చేపట్టిన మార్పులు కూడా చర్చగా మారాయి. వీటన్నిటి కంటే డబ్బుమూటలూ కీలకం. ముందుగానే ఎంత పెడతావు? ఎంత డిపాజిట్ చేస్తావు? అనే మాటలే పార్టీ కార్యాలయాల్లోని వార్‌రూముల్లో వినిపిస్తున్నాయి. ఎంపీకి వంద కోట్లు.. ఎమ్మెల్యే టిక్కెట్టుకు రూ.50 కోట్లు రేట్లు పెట్టేశారు. ఈ స్థాయిలో నగదు ఉంటేనే ప్రధాన పార్టీల్లో టిక్కెట్టు కోసం ప్రయత్నం చేయాలి. లేకుంటే ఇంట్లో కూర్చోవడమే. డబ్బు తప్ప రెండో ఎజెండా కనిపించడం లేదు. మూడో అంశం ప్రెస్‌మీట్లు పెట్టి ప్రత్యర్థి పార్టీని తిట్టడం.. వాటిని సోషల్‌మీడియాలో పెట్టడం. ఇదే కనిపిస్తోంది. ప్రజల ఎజెండా కనిపించడం లేదు. మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీలు ఎలా అమలు చేశామనే చర్చ అంతకన్నా కనిపించడం లేదు. సమస్యలపై చర్చలు, సవాళ్లు ఉంటే ప్రజలకు మేలు జరిగేది. ఈ కోణంలో పార్టీలు కనిపించడం లేదు. ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీల పోకడలు కనిపించడం లేదు. నేతలను ఒకచోట నుంచి మరోచోటకు బదిలీలు కూడా మొదటిసారిగా చూస్తున్నాం. ఓటర్ల జాబితాలను కూడా మలినం చేస్తున్నారు. అర్హులను తొలగించడం.. బోగస్ ఓట్లు చేర్పించే చర్యల్లో రాజకీయపార్టీలు ప్రత్యేక కార్యాచరణలో ఉన్నాయంటే పరిస్థితులు ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో ఆలోచించాలి.

అంగన్‌వాడీలు సమ్మె కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి పండుగ నాటికైనా పాలకులు కనికరించకపోతారా? అనే ఆశతో ఉన్న అంగన్‌వాడీల పట్ల నిరంకుశంగానే వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలమయ్యాయి. సమ్మె కొనసాగుతోంది. ఎంతకాలం సమ్మె చేసినా ప్రభుత్వం పట్టించుకోదా? ఎన్నికల సమయాన ఇలాంటి వైఖరి తగునా? ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మొండివైఖరితో ఉండటం ఎంతవరకూ సమంజసమనేది ఆలోచించాల్సిన అవసరం ఉంది. వైసిపి తప్ప అన్ని రాజకీయపార్టీలు అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపాయి. ఈ ప్రభుత్వం వచ్చాక ఇంతకాలం సమ్మె కొనసాగడం ఇదే.. గ్రామాల్లో పిల్లలకు తల్లులకు పౌష్టికాహారం అందించే చిరుద్యోగుల పట్ల ఎంతో ఉదాసీనతగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్ణయంగా ఉంది. ఇది ఎంతవరకు సమర్థనీయమనేది ప్రజానీకం కూడా ఆలోచించాలి. ఎన్నికలు, అధికారం తప్ప ఏమీ కనిపించడం లేదు. అధికారం కోసం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయాలనే ఆలోచన కలగదా? ఇదే నా పాలకుల చిత్తశుద్ధి? ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని పార్టీల పట్ల ఆయావర్గాలు ఎలా సానుకూలంగా ఉంటారనే ఆలోచనలో కూడా ప్రభుత్వం లేదు. డబ్బు పెట్టి ఓట్లు కొంటే తిరిగి అధికారం వస్తుందనుకుంటే భ్రమే అవుతుంది. గతంలో కొన్ని పార్టీలకు జరిగిన గుణపాఠాలను గుర్తు చేసుకుంటే మంచిది. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమ్మెను పరిష్కారం చేసే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు కనుమళ్లలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ
మండలంలోని కనుమళ్ల గ్రామంలో ఆదివారం నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరగనుంది. ఈ విగ్రహాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు ఆవిష్కరించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం శింగరాయకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీగా కనుమళ్ల గ్రామానికి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ విగ్రహావిష్కరణ సభకు విజయవాడ డిప్యూటీ కమిషనర్ మేక సత్తిబాబు, రిటైర్డ్ డిటిఒ మన్నం సుగుణమ్మ, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పీడీ సత్యపాల్, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రజ్ఞ, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కసుకుర్తి వెంకటరావు హాజరవుతారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబటి కొండలరావు, పూలుగూర కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

గద్దలగుంటలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు
గద్దలగుంట గ్రామాభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఈ నెల 13, 14, 15 తేదీలలో నిర్వహిస్తున్నట్లు గద్దలగుంట గ్రామాభివద్ధ కమిటీ గౌరవ అధ్యక్షులు డా.కొల్ల నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సంద ర్భంగా గద్దలగుంటపాలెంలోని రాములవారి గుడి సెంటర్లో ముగ్గుల పోటీలను శ్రీ ప్రసన్న చెన్నకేశవ దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథం ప్రారంభించారు. కార్యక్రమంలో లేళ్ళ కష్ణ మోహన్ మాట్లాడుతూ పూర్తిగా గ్రామీణ వాతావరణంలో మన సంక్రాంతి పండుగ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా 13వ తేదీన ముగ్గుల పోటీలు, 14వ తేదీన పరుగు పందెం, సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు, షటిల్, డాన్స్ పోటీలు డ్రాయింగ్ స్కిప్పింగ్, 15వ తారీఖున వక్తృత్వ పోటీలు, క్రికెట్ బాల్ అండ్ బక్కెట్ పోటీల నిర్వహణ మరియు 15వ తేదీ సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా బహుమతి ప్రదాన సభ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమాలలో ఒంగోలు నగర ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, ఈదుపల్లి అంకబాబు, ఆరిగ శ్రీలక్ష్మి, లేళ్ళ లీలావతి, ఈదుపల్లి కోటేశ్వరరావు, గ్రామ అభివద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీ నివాసరావు, సభ్యులు ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ నాయకులు

కమ్మేసిన మంచు

వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-శింగరాయకొండ
మంచు శనివారం ఒక్కసారిగా కమ్మేసింది. ప్రజలు మంచు దెబ్బకి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. వాహనదారులు పరిస్థితి చాలా దారుణంగానే ఉంది. పండుగలకు సొంతవాళ్ళకి వెళ్లా లనుకున్న వాహనదారులు మంచు దెబ్బకి తల్లడిల్లిపోతున్నారు. ఉదయం 10 గంటల దాటినప్పటికీ మంచు కమ్మేసే ఉంది. ఉదయం 9:45 నిమిషాలకు వచ్చిన బిట్రగుంట-విజయవాడ ప్యాసింజర్‌కూ మంచుదెబ్బ తప్పలేదు. ఆ సమయంలోనూ విపరీతంగా పొగ మంచు ఉండటంతో రైలుకు లైట్ వేసుకొని మరి పూర్తిస్థాయిలో హారను మోగించుకుంటూ ప్యాసింజర్ వచ్చింది. ఇక జాతీయ రహదారి మీద మోటార్ బైకు, కారు, లారీలు తదితర వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. లైట్లు వేసుకొని.. హారన్ కొడుతూ.. ప్రయాణిస్తున్నారు.

పొగమంచులోనే ప్రయాణిస్తున్న రైలు

జాతీయ రహదారిని కమ్మేసిన మంచు